ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పెన్షన్.. టెన్షన్

- వెరిఫికేషన్ ప్రక్రియతో పలువురిలో ఆందోళన
- పరిశీలనా కేంద్రం వద్ద వికలాంగుల పాట్లు
- గంటల తరబడి నిరీక్షణ
- అర్హులను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

ప్రజాశక్తి - భీమునిపట్నం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పలువురిలో ఆందోళన కలిగిస్తోంది. పింఛన్ల కుదింపు చర్యల్లో భాగంగానే ఈ పున: పరిశీలన అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో అందరిలో అలజడి మొదలైంది. అదే సమయంలో అనర్హత పేరిట అర్హులను తొలగిస్తే ఊరుకునేది లేదని వారంతా హెచ్చరిస్తున్నారు. మరోవైపు పింఛన్ల వెరిఫికేషన్ సెంటర్ వద్ద వికలాంగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రభుత్వ తీరుపై వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత నెల 23, 27 తేదీల్లో విశాఖ నగరంలో ఉన్న ప్రాంతీయ నేత్ర వైద్యశాల వద్ద జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పింఛను పొందుతున్న దృష్టి లోపం ఉన్న 147 మందికి ధ్రువ పత్రాల పున పరిశీలన, దృష్టి లోపం నిర్ధారణ పరీక్షలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా శారీరక వైకల్యం ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు మొదలుపెట్టారు. దీనిలో భాగంగా జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోగల నాలుగు వార్డుల్లో ఉన్న శారీరక వైకల్యమున్న 526 మందిలో తొలివిడతలో మంగళవారం వంద మందికి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సదరం ధ్రువీకరణ పత్రాల పున: పరిశీలన కేంద్రం వద్ద పరీక్షలు చేపట్టారు. ప్రత్యేకంగా నియమితులైన ఆర్థోపెడిక్ వైద్యులు ధ్రువీకరణ పత్రాల పున : పరిశీలనతో పాటు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జివిఎంసి 1, 2 వార్డుల పరిధిలో ఉన్న ఆదర్శ నగర్ 1, 2, బాలాజీ నగర్, మూడో వార్డు పరిధి అప్పికొండ వీధి వార్డు సచివాలయాల పరిధిలోగల శారీరక వికలాంగులు వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం వారి సహాయకులను



సదరం సర్టిఫికెట్ చూపుతున్న వికలాంగురాలు

వెంట తీసుకుని వెరిఫికేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. అనకాపల్లి నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ వైద్యులు నందకిషోర్, రవి కిరణ్, రవి చందర్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆసుపత్రి ఆవరణలో మిగతా 2లో..



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెటిరో ఉద్యోగులు

హెటిరోలో విషవాయువు లీక్

12 మందికి అస్వస్థత

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో మంగళవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువు లీకైనట్టు తెలుస్తోంది. 12 మంది ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ అంబులెన్స్‌లో తొలుత వారిని నక్కపల్లిలోని 50 పడకల ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి ముగ్గురిని విశాఖకు తీసుకెళ్లారు. అస్వస్థతకు గురైన వారిలో కె.వీరబాబు, జి.గౌరి నాయుడు, జి.సుబ్రహ్మణ్యం, వై.శివ, వి.వరుణ్ కుమార్, జి.శివప్రసాద్, ఎ.వెంకటప్రసాద్, జి.రామకృష్ణ, జి.శ్రీనివాస్, బి.సతీష్, ఎం.దేవుడు, జి.దినేష్ ఉన్నారు. వీరిలో కె.వీరబాబు, జి.గౌరినాయుడు, జి.సుబ్రహ్మణ్యంలను మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది.

ప్రధాన వార్త మెయిన్‌లో..

రౌడీషీటర్ రాజు సహా ముగ్గురు అరెస్టు

▶ వార్త 2లో..

బడ్జెట్‌పై నేడు అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన

▶ వార్త 2లో..

జీవన విధానంలో మార్పులతోనే కేన్సర్

▶ వార్త 3లో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి..

మూడు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న రఘువర్మ


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన తొలి రోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోగా, రెండో రోజైన మంగళవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను వారంతా ఆయన కార్యాలయంలో కలిసి సంబంధిత పత్రాలను సమర్పించారు. అనంతరం ఆర్ఒ సమక్షంలో ప్రమాణం చేశారు. నామినేషన్లు వేసిన వారిలో ఎపిటిఎఫ్ మద్దతుదారు, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఉన్నారు. ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అలాగే విశాఖ రైల్వే న్యూ కాలనీకి చెందిన కోసూరు రాధాకృష్ణ, అక్కయ్యపాలెం మిగతా 2లో..

మోగింది.. కల్యాణ వీణ

- జోరుగా వివాహాలకు ముహూర్తాలు
- మూడు నెలలు మినహా అన్ని నెలల్లో శుభకార్యాలు
- కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాహాలకు శుభ ముహూర్తం సమీపించింది. ఈ ఏడాదిలో మూడు నెలలు మినహా మిగిలిన అన్ని నెలల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయని పండితులు పేర్కొంటున్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ మినహా మిగిలిన తొమ్మిది నెలల్లో 104 పెళ్లి ముహూర్తాలు ఉండటం విశేషమని అంటున్నారు. గత మూడేళ్లలో ఇంత సంఖ్యలో ముహూర్తాలు లేవని గుర్తుచేస్తున్నారు. జనవరి 30 తర్వాత మంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు అధికంగా ఉండటంతో నగరంలో ముందుగానే ఎక్కడికక్కడ కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌ను వధూవరుల తల్లిదండ్రులు బుక్ చేసుకుంటున్నారు. సాధారణం నుంచి అతి పెద్ద ఫంక్షన్ హాల్స్‌కు ఒక్కసారిగా అందరూ ఎగబడటంతో డిమాండ్ అధికమైంది. వివాహాలకు నెల నుంచి రెండు నెలల ముందే



ఈ బుకింగ్‌లు జరుగుతున్నాయి. చుట్టుపక్కలున్న ప్రధాన ఆలయాల్లో కూడా బుకింగ్‌ల పరంపర కనబడుతోంది.

ఎందరికో జీవనోపాధి

ఈ ఏడాది ముహూర్తాలు అధికంగా ఉండటంతో ఎన్నో రంగాలకు సంబంధించిన వారికి జీవనోపాధి కలుగనుంది. ఇప్పటికే పెళ్లి దుస్తులు, బంగారు ఆభరణాలు, కిరాణా సరుకుల వ్యాపారాలు జోరందుకున్నాయి. లైటింగ్, డెకరేషన్, షామియానా, టైలరింగ్, వాయిద్య కళాకారులు, వేద పండితులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, వంట మేస్త్రులు, పువ్వుల వ్యాపారులు, పెయింటర్లు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



వెరిఫికేషన్ సెంటర్ వద్ద నిరీక్షిస్తున్న వికలాంగులు

పెన్షన్.. టెన్షన్

షామియానా, కుర్చీలు వేసినప్పటికీ వైకల్యులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

ఇబ్బంది పడుతూ వచ్చాను



బంధువుల సాయం తీసుకుని ఇక్కడకు వచ్చాను. ఈ క్రమంలో చాలా ఇబ్బంది పడ్డాను. వెరిఫికేషన్ అన్నారు కాబట్టి రాక తప్పలేదు. ప్రస్తుతం రూ.6 వేలు పింఛను పొందుతున్నాను.

ఎం.శ్రీనివాసరావు, గ్రంథాలయం వీధి, తగరపువలస

ఎప్పటి నుంచో పింఛను పొందుతున్నాను



ఎప్పటి నుంచో పింఛను పొందుతున్నాను. ఉదయం 9 గంటలకే బంధువుల సాయంతో ఆసుపత్రికి వచ్చాను. నా తల్లి ఫిట్స్‌తో బాధపడుతోంది. తండ్రి చనిపోయాడు. గత ప్రభుత్వంలో రూ 3 వేలు పింఛను వచ్చేది. ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం రూ 6 వేలు పింఛను అందిస్తోంది. అర్హులను తొలగించరాదు.

ఆర్.నాగవల్లి, అప్పికొండ వీధి, భీమిలి

సర్టిఫికెట్లతో వచ్చాను



పదేళ్లుగా నాకు పింఛన్ వస్తోంది. ఇదే మాకు ఆధారం. ఇప్పుడు నిర్ధారణ పరీక్షలు అంటున్నారు. పలువురిలో భయం నెలకొంది. వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లు తీసుకుని వచ్చాను.

కె.అప్పలకొండ, గొల్ల వీధి, తగరపువలస

మోగింది.. కల్యాణ వీణ

ఫొటోగ్రాఫర్లు, ట్రావెల్స్ నిర్వాహకులు.. ఇలా పలు రంగాల వారికి ఈ పెళ్లిళ్లతో ఉపాధి లభించనుంది.

శుభ ముహూర్తాలు ఇవీ..

ఫిబ్రవరిలో 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15 తేదీలు, మార్చిలో 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26 తేదీలు, ఏప్రిల్‌లో 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29 తేదీలు, మేలో 1, 2, 3, 5, 10, 12, 14, 20, 27, 28, 29, 30 తేదీలు, జూన్‌లో 3, 7, 10, 11, 12 తేదీలు శుభ ముహూర్తాలు ఉండగా, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వివాహాల ముహూర్తాలు లేవు. అక్టోబర్‌లో 14, 16, 17, 18, 20, 21, 22, 23, 25, 30, 31 తేదీలలో శుభ ముహూర్తాలు ఉండగా, నవంబర్‌లో 7, 13, 14, 18, 19, 20, 21, 22, 26, 27 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇక ఈ ఏడాది ఆఖరి మాసం డిసెంబర్‌లో 2, 4, 5, 6, 15, 16, 17, 18, 19, 20, 23, 24, 30 తేదీల్లో మంచి ముహూర్తాలుగా ఉన్నాయని వేద పండితులు తెలిపారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి.. మూడు నామినేషన్లు

అబిద్ నగర్‌కు చెందిన సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఒకు సమర్పించారు. ఎఆర్ఒ బిహెచ్.భవాని శంకర్, నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు సంబంధిత సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి అభ్యర్థులకు సహాయ సహకారాలు అందజేశారు.

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎపిటిఎఫ్ సంఘ సభ్యులతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రఘువర్మకు ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మద్దతు తెలిపారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఆనందపురం మండలం ఎంఇఒగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. మరొక ఇండిపెండెంట్ అభ్యర్థి కోసూరు రాధాకృష్ణ జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ (ఎయిడెడ్) కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన గాదె శ్రీనివాసులునాయుడు పిఆర్‌టియు మద్దతుతో శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన మద్దతుదారులు తెలిపారు.

రౌడీషీటర్ రాజు సహా ముగ్గురు అరెస్టు

హత్యాయత్నం కేసుతో రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనను ఉద్యోగం నుంచి తీసేశారన్న కోపంతో చిన్నపిల్లలపై పగబట్టిన ఓ రౌడీషీటర్ సహా ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సిఐ జి.డి.బాబు కథనం మేరకు.. వన్‌టౌన్‌లోని ఎవిఎన్ కాలేజ్ డౌన్ ప్రాంతంలో ఉంటున్న రాజు అలియాస్ రేవల రాజు అనే రౌడీషీటర్ గతంలో కొన్నాళ్లు పెద్దాసుపత్రి కెజిహెచ్‌లో పని చేసేవాడు. పిల్లలపై అత్యాచారయత్నానికి పాల్పడడం, మద్యం సేవించి డ్యూటీకి రావడం వంటి ఆరోపణలతో వైద్యాధికారులు ఆయన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు ఈ నెల 1న మధ్యాహ్నం వేళ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డుకు ఆక్సిజన్ సరఫరా అయ్యే పైపులను కట్ చేసే ప్రయత్నం చేశాడు. దీనిని గమనించిన సెక్యూరిటీ గార్డులు అడ్డగించే ప్రయత్నం చేశారు. వారిని రాజు కత్తితో బెదిరించాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు ఈ దుశ్చర్యకు ప్రయత్నించారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. పిల్లలకు ప్రాణవాయువు అందకుండా చేసి వారిని చంపేయాలన్న దురుద్దేశంతో మరో ఇద్దరి సాయంతో రాజు ఈ పని చేశాడని అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ సిఐ జి.డి.బాబు తన సిబ్బందితో కలిసి కెజిహెచ్‌కు వెళ్లి పరిశీలించారు.

సిసి ఫుటేజీ ఆధారంగా వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు రాజు సహా మరో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, ఆ ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. రాజుపై గతంలోనూ పలు కేసులున్నాయన్నారు.

జాతీయ క్రీడలకు టెక్నికల్ ఆఫీసర్‌గా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 7 నుంచి 14 వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడలకు టెక్నికల్ ఆఫీసర్‌గా నగరానికి చెందిన డివిఎస్‌వై.శర్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, ఎల్‌ఐసి ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, ఎల్‌ఐసి ఉద్యోగులు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జెకె.నాయక్, అసోసియేషన్ సభ్యులు ఆయన్ని అభినందించారు. ప్రస్తుతం డివిఎస్‌వై శర్మ ఎల్‌ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు.

వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (రోటరీ డిస్ట్రిక్ట్ 3020) నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులకు 200 వీల్ చైర్లను, బియ్యం బస్తాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (రోటరీ డిస్ట్రిక్ట్ 3020) గత నాలుగేళ్లుగా గంభీరంలోని ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు సహకారం అందిస్తోందన్నారు. గోల్ఫ్ క్రీడ ద్వారా సుమారు రూ.10 లక్షల నిధులను సేకరించి పలు సంస్థలకు నిత్యావసర సరుకులు అందిస్తోందని తెలిపారు. రాజమండ్రిలోని గౌతం కంటి ఆసుపత్రికి ఇప్పటి వరకు రూ.కోటి విలువ చేసే సామగ్రి అందించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ పోలియో, కేన్సర్ నిర్మూలనకు పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా 9 - 14 ఏళ్ల బాలికలు 10 వేల మందికి సుమారు రు.2600 విలువ చేసే వ్యాక్సిన్లను ఉచితంగా అందించామన్నారు. కాకినాడ జిజిహెచ్‌లో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో త్వరలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఇటీవల 75 మంది అంధ విద్యార్థులకు రూ.35,000 విలువచేసే స్మార్ట్ గ్లాసెస్ అందించామన్నారు. 800 మంది మహిళలకు హై ఎండ్ కుట్టు మిషన్లు ఇచ్చామన్నారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించడంలో భాగంగా సుమారు 9600 మంది గిరిజన మహిళలకు 90 రోజుల నిడివిగల బేసిక్ లిటరసీ ప్రోగ్రాంను సమిధ పేరుతో నిర్వహించామని తెలిపారు. మీడియా సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ ప్రెసిడెంట్ ఎండి.యాసీన్, కార్యదర్శి చింత నతాజీ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై నేడు అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జీవన విధానంలో మార్పులతోనే కేన్సర్

కేన్సర్ నివారణ దినోత్సవంలో ప్రముఖ అంకాలజిస్టుల వెల్లడి

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జీవన విధానంలో వస్తున్న మార్పుల కారణంగానే కేన్సర్ వస్తుందని ప్రముఖ అంకాలజిస్టులు వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవ శాస్త్రాల విభాగం ఆధ్వర్యాన మంగళవారం సదస్సు నిర్వహించారు. పొగతాగడం, మద్యం సేవించడం, అతిగా ఫాస్ట్ ఫుడ్‌లకు అలవాటు పడటం వంటివి కేన్సర్‌కు దారి తీస్తున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఒమేగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, అంకాలజిస్ట్ డాక్టర్ బి.రవిశంకర్ మాట్లాడుతూ, దేశంలో ఏటా 1.4 కోట్ల మంది కేన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. జన్యుపరమైన కారణాలు కంటే జీవన విధానంలో వచ్చిన మార్పులే కేన్సర్‌కు ప్రధాన కారణమన్నారు. తల, మెడ కేన్సర్‌కు గల కారణాలను, లక్షణాలను వివరించారు. స్టార్డ్ విశాఖ కేన్సర్ క్లినిక్ చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.రఘువంశీ మాట్లాడుతూ, కడుపు, అన్న వాహిక కేన్సర్ కారణాలను వివరించారు. తక్కువ విటమిన్లు, అధిక ఉప్పు వినియోగం, ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడటం దీర్ఘకాలంలో కేన్సర్‌కు దారితీస్తోందన్నారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ బాల స్టాలిన్ చౌదరి మాట్లాడుతూ, ఏటా కేన్సర్‌కు సంబంధించిన పరీక్షలకు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, కన్వీనర్ ప్రొఫెసర్ ఎమ్.రామారావు, జీవ శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గీతం దంత కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన ర్యాలీ, జిమ్‌సర్ ఆసుపత్రి ఆధ్వర్యాన కేన్సర్ ఉచిత పరీక్షలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆనందపురం : ఆనందపురం మండలం, వేములవలస గ్రామంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పి.పాపారావు మాట్లాడుతూ ప్రజలు కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగం జోషి, పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, కెఎన్.రావు, పచ్చిపులుసు కనకారావు, రఘు, వినోద్, నాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు ఆధ్వర్యాన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా ర్యాలీ నిర్వహించారు.



భీమిలిలో కేన్సర్ నివారణపై అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన పట్టణ పుర వీధుల్లో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఎం.ఫణి కుమార్ ఆధ్వర్యాన సిహెచ్‌సి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గంట స్తంభం, పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఐసిటిసి కౌన్సెలర్ రావి వెంకటరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మానవ హారం నిర్మించారు.

ఆరిలోవ : ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో కేన్సర్ సెంటర్, ఐసిఎంఆర్, రాష్ట్ర అంకాలజీ సంఘాల ఆధ్వర్యంలో ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో కేన్సర్ సెంటర్‌లో 'యునైట్ బై యునిక్' జాతీయ క్యాంపెయిన్‌ను ముఖ్యఅతిథి ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ ఐ.వాణి, గౌరవ అతిథి ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ మురళీ మోహన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, ఈ క్యాంపెయిన్‌ను భారత ప్రభుత్వం కేన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా గుర్తించాలనే విజ్ఞప్తితో ముందుకు వెళ్తున్నారు. భారత దేశంలో ఏటా 14 లక్షల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హెమటో అంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్ బోయా, డాక్టర్ వెంట్రపాటి ప్రదీప్, డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ ఎంపిఎస్ చంద్ర కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఒమెగాలో సంచార కేన్సర్ నిర్ధారణ కేంద్రం ప్రారంభం



సంచార కేన్సర్ నిర్ధారణ కేంద్రం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఒమెగా ఆసుపత్రిలో సంచార కేన్సర్ నిర్ధారణ పరీక్షా కేంద్రం వాహనాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగానే గుర్తించి, సరైన వైద్యం తీసుకుంటే మరణాల రేటు తగ్గించవచ్చన్నారు. గ్రామాల్లో కేన్సర్‌పై అవగాహన తక్కువని, ఈ పరిస్థితిలో సంచార వాహనం సేవలు గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తరించాలని కోరారు. ఒమెగా మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ సంచార వాహనంలో మమ్మోగ్రఫీ, పాప్ స్మియర్, అల్ట్రాసౌండ్, మెడికల్ అంకాలజీ కన్సల్టేషన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. నేటి నుంచి రెండు నెలల పాటు 50 స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి కేన్సర్‌ను ముందుగా నిర్ధారించే కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఒమెగా వైద్యులు, కేన్సర్‌ను జయించిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గాజువాక : కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాక హైస్కూల్ రోడ్డు సాయిరాంనగర్‌లోని స్వామి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు కూర్మమ్మ స్కౌట్స్ ట్రూప్, గైడ్స్ కంపెనీ ఆధ్వర్యాన ఐదు కిలోమీటర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సాయిరాంనగర్, శంకర్ నగర్, మారుతినగర్ మీదుగా హైస్కూల్ రోడ్డును కలుపుతూ గాజువాక మెయిన్ రోడ్డు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, స్వామి విద్యానికేతన్ ప్రిన్సిపల్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ లక్ష్మణస్వామి, పాఠశాల కరస్పాండెంట్ పాలూరు దేవి, గరిమెళ్ల పద్మజాపూర్ణ, సింగిరెడ్డి లక్ష్మి, రేగు మోహన్, అచ్యుతుని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : భారతదేశాన్ని కేన్సర్ రహిత దేశంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వైద్యులు డిడి నాయుడు అన్నారు. ప్రపంచ కాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ వాకర్స్ ట్రాక్ వద్ద కేన్సర్, తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్ నాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నారాయణరావు, వై శివ, చవితిన నరసింగరావు, డిఎస్-ఎస్ మాణిక్యాలరావు, ఆడారి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన జీవన విధానం, క్యాన్సర్‌పై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు ఎస్ సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎం గోవిందరావు, యమునా, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎ.మనీషా మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడినవారికి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.ఎ.సుబ్బారావు, ఎం ఎ ఎల్ వి. ప్రసాద్, ఎస్ఆర్‌కె.నరసింహారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లిఖిత ఆధ్వర్యంలో పిహెచ్‌సి నుండి అచ్యుతాపురం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఉన్న కుటుంబాలలో 40 ఏళ్ల పైబడిన వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి మామోగ్రఫీ, స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ వేణుగోపాల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం : ప్రపంచ కేన్సర్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కెవి.జ్యోతి పాల్గొన్నారు. కేన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజకుమారి, హెచ్ఎస్ సత్యనారాయణ, హెచ్‌వి ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములపూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుమ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ ఎం.ఆనంద్, ఎంఎల్‌హెచ్‌పిఎలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కేన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.కార్యక్రమంలో సిహెచ్ఒ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది,ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోలుగుంట : ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి, సిబ్బంది వివరించారు.

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కేర్ (యుఐసిసి) పేర్కొన్న యునైటెడ్ బై యూనిక్ బేనర్లతో కేన్సర్ పట్ల అవగాహన కల్పించారు. నివారణ, చికిత్సా విధానాలను తెలియజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పాల్గొని మాట్లాడారు. డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పాండురంగ కుమారి, డాక్టర్ గురు రాఘవేంద్ర నాయక్, డాక్టర్ కె.సాయి సుశ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలి

ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ ఉమెన్స్ జూనియర్ కాలేజీలో మంగళవారం డాక్టర్ వైఎల్.నరసింగరావు అధ్యక్షతన అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ కేన్సర్ నివారణ చాలా ముఖ్యమైనదని, దానికి ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. కెజిహెచ్ ప్రసూతి విభాగం అధిపతి డాక్టర్ సంధ్యా దేవి మాట్లాడుతూ కేన్సర్‌ను గర్భాశయ ముఖ ద్వారా పరీక్ష ద్వారా తెలుసుకోగలమని, కెజిహెచ్‌లో ఉచితంగా ఆ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ నరసింగరావు మాట్లాడుతూ ప్రతి నెలా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని, వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ సౌమిని మాట్లాడుతూ పిల్లలు తప్పక వ్యాక్సిన్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జివి.కిరణ్మయి, డాక్టర్ హారిక, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వైఎల్.నరసింగరావు తదితరులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... విజయనగరం జిల్లా తెర్లాం మండలం పణుకువలసకు చెందిన అలుగుబెల్లి గణేష్ (43) కుటుంబంతో మధురవాడ మిధిలాపురి ఉడాకాలనీలో నివాసముంటున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుని భార్య శ్రావణి పిఎం.పాలెంలో టైలర్ పనులకు వెళ్లారు. ఇద్దరు కుమార్తెలు పాఠశాలకు వెళ్లారు. ఆ సమయంలో గణేష్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామ శివార్లలో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.502 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడిచేశామన్నారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది జల్లుబాబు, శ్రీను పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో జనవరి 28, 30 తేదీల్లో జరిగిన అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ చూపారని స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. 17 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు వివరించారు. ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్‌లో ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 138 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి ఈ మీట్‌లో పాల్గొనగా తమ కళాశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



పొలం పిలుస్తోందిలో తెగుళ్లపై వివరిస్తున్న వ్యవసాయాధికారి

నరసాపురంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని తునివలస గ్రామపంచాయతీ పరిధి నరసాపురంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి బేబీ చలాన్ ఆధ్వర్యాన నిర్వహించారు. గ్రామంలో రబీ సాగులో భాగంగా వేసిన ఉలవలు, మినప పంటలను పరిశీలించారు. మినప చేనులో పళ్ళ ఆకు తెగులును గుర్తించారు. ఈ తెగులు లక్షణాలను రైతులకు వ్యవసాయాధికారి వివరించారు. ఆకు పసుపుపచ్చగా మారి గిరిడి బారుతుందని తెలిపారు. పసుపుపచ్చగా ఉన్న ఆకులను పంటలో నుంచి వెంటనే తొలగించాలని సూచించారు. రైతులు ఈ తెగులు గుర్తించిన వెంటనే మేంకో జెంబ్ కార్బన్‌డయాజుమ్ 250 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలని చెప్పారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు రూ.87 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను ఐడిబిఐ బ్యాంక్ విశాఖ డివిజనల్ జనరల్ మేనేజర్ కె.దాస్ మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రయోజనార్థం బ్యాంకులు నిధులు వెచ్చించడం సామాజిక బాధ్యత అని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి మాట్లాడుతూ, విద్యార్థులతో మాట్లాడడానికి సరైన కమ్యూనికేషన్ సిస్టం లేని తరుణంతో ఐడిబిఐ బ్యాంకు మధురవాడ శాఖ బ్రాంచ్ మేనేజర్ లత బ్రాంచ్ నుంచి సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.స్వామి, ఎస్.సోమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో తెలుగు అధికారులను నియమించాలి

విదసం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం, ప్రాణ త్యాగం అర్థం తెలిసిన తెలుగు అధికారులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నియమించాలని విదసం ఐక్యవేదిక నాయకులు డిమాండ్‌చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో పరిశ్రమను తిరిగి నిలబెట్టడానికి సిఎమ్‌డితో సహ కీలకమైన ఆపరేషన్, కమర్షియల్, ఫైనాన్స్ డైరెక్టర్లను తెలుగు వారినే నియమించేలా చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. అంబేద్కర్‌భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, త్యాగాలతో వచ్చిన స్టీలుప్లాంట్ గురించి తెలిసిన తెలుగు సిఎమ్‌డి మాత్రమే కేంద్రం ఇచ్చిన ప్యాకేజీని సమర్థంగా వినియోగించి పరిశ్రమను పునర్జీవింప చేయగలరని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతీసుకుని కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. ప్రకటించిన ప్యాకేజీ సొమ్మును బాధ్యత లేని అధికారులు చేతిలో పెడితే లక్ష్యం నెరవేరదన్నారు. ఇప్పుడున్న సిఎమ్‌డి, ఇతర ఉత్తరాది రాష్ట్రాల డైరెక్టర్లకు విశాఖ ఉక్కు పోరాట త్యాగాలు తెలియవన్నారు.

ప్యాకేజీ నిధుల నుంచి ముడి సరుకు కొనుగోలుకు, కార్మికుల జీతాలు చెల్లింపునకు అనుమతి కోరాలని కోరారు. విద్యుత్, నీటి చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలని, మాదారం, జగ్గయ్య పేటల్లో జరిగే మైనింగ్‌పై రాయల్టీ వాయిదా వేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలిపి వేసి నిర్వాసితులకు ఉపాధి భరోసా కల్పించాలని ముఖ్యమంత్రికి ఉత్తరం రాసినట్లు తెలిపారు. ప్లాంటు స్థితిగతులపై ముఖ్యమంత్రి నేతృత్వంలో మూడు నెలలకోసారి సమీక్ష చేసి యాజమాన్యానికి సలహా మండలిగా ఉండాలని కోరారు. పోలవరం, అమరావతి, పిఎంఎవై నిర్మాణాలకు విశాఖ ఉక్కునే కొనుగోలు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రధాని మోదీచే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, జాజీ ఓంకార్, గొల్లమాల అప్పారావు, గుడాల ఈశ్వరరావు, బూల భాస్కరరావు, రాజేంద్రప్రసాద్, రవిశేఖర్, రవి, సంతోష్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బూసి వెంకటరావు

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : దేశీయ విత్తనాలతో కూరగాయలు, ఆకుకూరలను నాటి వంటింటి వ్యర్థాలను ఎరువుగా వేసి పంటలు పండించుకొని ఆరోగ్యకరమైన ఆహారాన్ని భుజించాలని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) డిప్యూటీ కమాండెంట్ డి.రిషబ్ పిలుపునిచ్చారు. మల్కాపురంలోని సిఐఎస్ఎఫ్ సమావేశ మందిరంలో ప్రకృతి ఆధారంగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించేందుకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం మాట్లాడుతూ, రసాయన ఎరువులు, రసాయన క్రిమి సంహారకాలు వినియోగించకుండా ప్రకృతి ఆధారంగా పంటలు పండించుకోవాలని సూచించారు. విశాఖ నగరంలోని ప్రజలంతా తమ ఇంటి వద్ద కూరగాయలు పండించుకోవాలనే ఆలోచనతో జివిఎంసి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. సాధ్యమైనంత వరకూ తమ ఇంటి బాల్కనీలో, ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాలలో కూరగాయలు, ఆకుకూరలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ సోషల్ వర్క్ విద్యార్థులు రాజేశ్వరి, శైలజ, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి -ములగాడ : అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి చంపిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన జివిఎంసి 63వ వార్డు పరిధి చింతలలోవ జంక్షన్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల జయ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయినా మహిళలకు రక్షణ లేదన్నారు. మానభంగాలు, హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉత్తరప్రదేశ్‌లో దళిత యువతిపై అత్యాచారం చేసిన వారిని తక్షణమే బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మహిళల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పందిరి జయలక్ష్మి, ముత్యాలమ్మ, పి.రమానాగమణి, బోనుల అచ్చమ్మ, రమ, పావని తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో రైతు పాండ్రంగి అప్పలరాజు పొలంలో వేసిన మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గుర్తించి, నివారణ చర్యలు ప్రారంభించారు. రైతులకు సహాయంగా 'అగ్నాస్త్రం' తయారుచేసి పంపిణీ చేశారు. ఈ అగ్నాస్త్రంలో 5 కిలోలు వేప ఆకు, 500 గ్రాముల వెల్లుల్లి, ఒక కేజీ పచ్చి మిర్చి, 1 కిలో జిల్లేడు ఆకులు, 10 లీటర్ల ఆవు మూత్రం కలిపి మరిగించి రైతులకు పంపిణీ చేశారు. ఈ మందు ద్రావణం ద్వారా కత్తెర పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ మోహనరావు, గణేష్, పద్మనాభం మండల ఎన్ఎఫ్ఎ మోడల్ టీం సిబ్బంది విద్యాసాగర్, హేమ్‌సుందర్, ఐసిపిఆర్‌పి బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలన వారోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి -పద్మనాభం : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కుష్టు వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా రేవిడి పిహెచ్‌సిలో రైటర్ ప్యూచర్ సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి సప్న కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

హైస్కూల్‌ను సందర్శించిన ఎఐఎస్ఎఫ్ బృందం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి ఆర్ఆర్.వెంకటాపురంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఎఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. పాఠశాల వద్ద దుర్వాసన రావడంతో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నేపథ్యంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అక్కడే ఉన్న డిప్యూటీ డిఇఒ సోమేశ్వరరావు, ఎంఇఒ దివాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. వారు తింటున్న భోజనాన్ని తిని పరిశీలించారు. దుర్వాసన వచ్చిన తరగతి గదిని సందర్శించారు. ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రతిరోజూ తరగతి గదులు శుభ్రం చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు బి.కిరణ్, సహాయ కార్యదర్శి హేమంత్, సభ్యులు సిద్ధూ పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని పోర్టు డాక్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోర్టు హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 127వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలనుద్దేశించి కె.సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం తగదన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రైవేటీకరణ నిర్ణయం అన్యాయమని, దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.రామలింగేశ్వరరావు, కెఎస్.కుమార్, బి.రాజగోపాల్, సిహెచ్‌విఎస్.రెడ్డి, జిసిహెచ్‌వై.నాయుడు, బి.జగన్, రాఘవులు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యశ్రీకి అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : జనవరి 26న ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ఎన్ఎస్ఎస్ నుంచి సెయింట్ ఆన్స్ కళాశాల వాలంటీర్ పోలిమేర దివ్యశ్రీ పాల్గొని రాష్ట్రపతి, ప్రధానమంత్రి తదితర పెద్దల అభినందనలు అందుకొని నగరానికి వచ్చిన సందర్భంగా ఆమెను సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతం నుంచి తమ కళాశాలకు చెందిన దివ్యశ్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం గర్వకారణం అన్నారు. అభినందన సమావేశంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, ఇతర ప్రోగ్రాం అధికారులు వి.అంజలీదేవి, ఎన్.నదియ, ఎ.సంధ్యారాణి వాలంటీర్లు పాల్గొన్నారు.

రమణ కుటుంబానికి రూ.14 లక్షలు నష్టపరిహారం

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పి ఎల్‌పిజి గ్యాస్ ప్లాంట్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుడు గొరపల్లి రమణ మంగళవారం బి షిఫ్ట్‌లో రాత్రి 8:30 గంటలకు లోడింగ్ చేస్తున్న సందర్భంలో అకస్మాత్తుగా మృతిచెందాడు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేశపాత్రునిపాలేనికి చెందిన రమణ మృతి చెందిన విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎం.కృష్ణారావు, బి.శ్రీను ఘటనా స్థలానికి చేరుకున్నారు. రమణ భార్య రమణమ్మ, కుమార్తె దుర్గాకల్యాణి, కుమారుడు రాజేష్‌తో నాయకులు మాట్లాడి, తగిన నష్టపరిహారం ఇచ్చేవరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎల్‌పిజి ప్లాంట్‌లో కార్మికులంతా పనులు బంద్ చేసి మృతుని కుటుంబానికి అండగా నిలిచారు. హెచ్‌పి ఎల్‌పి గ్యాస్ యజమాని చర్చలకు రాకపోవడంతో రమణ మృతదేహాన్ని గేటు వద్ద ఉంచి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో యాజమాన్యం దిగి వచ్చి రూ.14 లక్షలను 15 రోజుల్లో ఇవ్వడానికి, ఇఎస్ఐ, పిఎఫ్, లోడింగ్, అన్‌లోడింగ్ అసోసియేషన్ క్లియర్ చేసి ఇవ్వడానికి అంగీకరించారు. ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎసిపి, సిఐ పర్యవేక్షణలో దేశపాత్రునిపాలెం గ్రామ పెద్దలు, హెచ్‌పి గ్యాస్ డీలర్, కాంట్రాక్టర్లు, హెచ్‌పి గ్యాస్ యాజమాన్యం, సిఐటియు నాయకులు లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, కృష్ణారావు, సత్యారావు, త్రిమూర్తులు, అచ్యుతరావు, మేస్త్రి రమణ, 60 వార్డు కార్పొరేటర్ పివి సురేష్, అనీల్ మధ్య చర్చలు జరిగాయి.


ఆందోళన చేస్తున్న కార్మికులు

శతశాతం అభ ఐడి మ్యాపింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు ఆదేశించారు. కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎమ్‌లు, మిగతా ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇ-ఆశా యాప్, అర్బన్ హెల్త్ న్యూట్రిషనల్ డే, హోమ్ బేస్ట్ కేర్ ఫర్ యంగ్ చైల్డ్, హోం బేస్డ్ న్యూ బోర్న్ కేర్, నేషనల్ డీ వార్మింగ్ డే, ఎన్‌సిడి 3.0 సర్వే తదితరాలపై వివరించారు.

శాంతిభద్రతలను కాపాడటమే కర్తవ్యం

ప్రజాశక్తి -గాజువాక : న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడటమే మొదటి కర్తవ్యంగా పనిచేస్తానని సిఐ కామేశ్వరరావు తెలిపారు. గ్రామాల పర్యటనలో భాగంగా మంగళవారం పెంటమాంబ ఆలయ సముదాయన్ని సందర్శించారు. శ్రీ పెంటమాంబ అమ్మవారి చరిత్ర, పండగల విశేషాలు ఆలయ కమిటీ సభ్యులనడిగి తెలుసుకున్నారు. ఆలయ పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పెంటమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిఐ కామేశ్వరరావుతో పాటు, ట్రాఫిక్ ఎస్ఐ గణపతి, ఎస్ఐ ఉమామహేశ్వరరావును ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశీ మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, గొందేశీ సత్యారావు, గొందేశీ అప్పలరెడ్డి, యెల్లేటి శ్రీనివాసరావు, గంట్యాడ పైడిరాజు, పిట్ట కుంచారావు, ముద్దుర్తి శ్రీరామమూర్తి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

ఎంవిఆర్ జాబ్ మేళాకు విశేష స్పందన


ఎంవిఆర్‌లో జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని ఎంవిఆర్ కళాశాలలో మంగళవారం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. 500 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలో కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఎ.కామేశ్వరరావు, ప్రిన్సిపల్ బాలకృష్ణ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాంకీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ప్రమాదం

- కార్మికుని ముఖంపై కెమికల్ లిక్విడ్ పడడంతో తీవ్ర గాయాలు

- మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు నేత గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ

విశాఖ ఫార్మాసిటీలోని రాంకీ ఎఫ్లుయిన్ వేస్టు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు కరణం ముత్యాలు (45) మంగళవారం రాంకీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లో పనిచేస్తుండగా ముఖంపై కెమికల్ లిక్విడ్ పడడంతో 30 శాతం గాయాలయ్యాయి. వెంటనే విశాఖలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని పరవాడ ఎస్ఐ కృష్ణారావు సందర్శించి వివరాలు సేకరించి దర్యాప్తు జరుపుతున్నారు.

సమాచారం అందుకున్న ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్య సేవలందించాలని, కార్మికుడు కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని, జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల గతంలో కూడా ఈ పరిశ్రమలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన యాజమాన్యాలు పూర్తిగా గాలికి వదిలేస్తున్నాయని మండిపడ్డారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనులు కల్పించాలి

ప్రజాశక్తి-యలమంచిలి : కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పనులు కల్పించి ఆదుకోవాలని అక్కడ దినసరి కార్మికులు వేడుకుంటున్నారు. మంగళవారం కొక్కిరాపల్లి నూనెగింజల పరిశోధన స్థానంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులంతా కలిసి సిఐటియు ఆధ్వర్యంలో పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రతినిధి శివాజీ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా 70 మంది కార్మికులు పని చేస్తున్నారని, రొటేషన్ పద్ధతిలో పనులు కల్పించేవారని తెలిపారు. ప్రస్తుతం నువ్వులు మాత్రమే పండించిడం మూలంగా కూలీ పనులు తక్కువగా ఉండడంతో నెలలో కొన్ని రోజులు కూడా కూలి పనులు దొరకడం లేదన్నారు. పరిశోధనా కేంద్రంలో పనులు పెంచి కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ధనలక్ష్మి, ఈశ్వర్‌బాయి, శ్రీదేవి, లక్ష్మి, మరికొందరు పాల్గొన్నారు.

ఆశాలు అంకితభావంతో పని చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : ఆశా కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ అన్నారు. ఆశా డే సందర్భంగా పరవాడ పిహెచ్‌సిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు అందరికీ సకాలంలో అందజేసి యు విన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మీజిల్స్ వ్యాక్సిన్ పెండింగ్ లేకుండా ప్రతి బిడ్డకు అందజేయాలన్నారు. ఫిబ్రవరి 10న నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతి పిల్లవాడికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య సేవలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు మాట్లాడుతూ అక్రమ దత్తత, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాలల హక్కులు వంటి వాటికి భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. అటువంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే 100, 1098, 112 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, స్టాటిటికల్ ఆఫీసర్ రామచంద్రరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్.సాయిరాం, పిహెచ్ ఎన్ జానకి రామన్ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచిని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. పరవాడ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాల్యవివాహాలను అరికట్టాలని, ఫోన్ల వినియోగంపై అవగాహన వచ్చే వరకు పిల్లలకు ఫోన్లు అందుబాటులో ఉంచకూడదని సూచించారు. మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నియంత్రించాలన్నారు. ప్రస్తుతం చిన్నారుల మీద ఎక్కువగా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాల్సి ఉందన్నారు. స్త్రీ పురుషులు సమానత్వంతో ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. వరకట్న వేధింపులు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ నారాయణరావు, సివిక్స్ లెక్చరర్ లక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

నేడు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్మికులకే నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా బుధవారం జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లను నిరసిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం జరుగు నిరసన ప్రదర్శనలో భాగంగా అనకాపల్లి నెహ్రూ జంక్షన్లో ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్పు చేసి పరిశ్రమ అధిపతులకు అనుకూలంగా ఉండేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు గా కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు చేయబోతున్నదని, దీనికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని తెలిపారు.

హాస్పిటల్‌లో డాక్టర్ లేక అవస్థలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెద్దపల్లిలో అత్యాధునిక ఆసుపత్రి నిర్మించినా, 13 నెలలుగా డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. స్టాఫ్ నర్సులతోనే కాలం వెల్లదీస్తున్నారని చెబుతున్నారు. పెద్దపల్లి గ్రామాన్ని అనుకొనే ఉన్న గొల్లలపాలెంలో మంగళవారం ఉదయం ద్వారపూడి కాసులు అనే వ్యక్తి ఛాతి నొప్పితో హాస్పిటల్‌కి వెళ్తే తాము ఏమీ చెయ్యలేమని అక్కడి స్టాఫ్ చేతులెత్తేశారని వారి కుటుంబ సభ్యులు వాపోయారు. దీంతో అతి కష్టం మీద బాధితుడిని మరో హాస్పిటల్‌కు చేర్చడం జరిగిందని తెలిపారు. ఇటువంటి విపత్కర సమయాల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం విచారకరమని జనసేన యువ నాయకులు సత్యనారాయణ, పెదనాని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి స్టాఫ్ నర్స్‌తో ఫోన్‌లో సంప్రదించడానికి ప్రజాశక్తి విలేకరి ప్రయత్నించగా ఆసుపత్రి నుండి స్పందన లేదు.


ఎన్‌సిసి విద్యార్థికి అవార్డు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం డిప్లమో మెకానికల్ చదువుతున్న పూడిమడకకు చెందిన గనిగిరి దుర్గాప్రసాద్‌కు డిజి ఎన్‌సిసి కమాండేషన్ అవార్డుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌సిసి రాష్ట్ర డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ డిప్యూటీ డైరెక్టర్ వివిఎం రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. దుర్గాప్రసాద్ అవార్డు రావడం పట్ల పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తోటి విద్యార్థులు గ్రామస్తులు అభినందించారు.

యువకుడు మృతిపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయితీ శివారు పెద నాయుడు పాలెం గ్రామానికి చెందిన యువకుడు నారపాడు పూర్ణ శేఖర్ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన కేసులో రెండవ రోజు పరవాడ డిఎస్‌పి వి విష్ణు స్వరూప్ మంగళవారం దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పి.సింహాచలం మాట్లాడుతూ పూర్ణ శేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసుపై ఇంకా పోస్టుమార్టం రిపోర్ట్ రావాల్సి ఉందని చెప్పారు. సిడి ఫైల్‌పై డిఎస్పి విచారణ చేస్తున్నారని, విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

జగన్‌ను కలిసిన ధర్మశ్రీ, అమర్‌నాథ్



జగన్‌ను సత్కరించిన ధర్మశ్రీ, చిత్రంలో అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు జగన్ ధర్మశ్రీతో సమావేశమయ్యారు. అనకాపల్లి పార్లమెంట్ వైసిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనకాపల్లి పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశాన్ని రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసి విజయవంతం చేసినందుకు, చోడవరం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా గుడివాడ అమర్నాథ్‌ను అక్కడి పార్టీ నేతలు, కార్యకర్తలకు పరిచయం చేసి చోడవరంలో కూడా సమావేశాన్ని విజయవంతం చేసినందుకు జగన్మోహన్ రెడ్డి ధర్మశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. రానున్న ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా ధర్మశ్రీకి జగన్మోహన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం నులిపురుగుల నిర్మూలన దిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, పాఠశాలకు వెళ్లని వారు, కౌమార బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయసు గల పిల్లలకు అరమాత్ర, మిగిలిన వారు పూర్తి మాత్రను వేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. 10వ తేదీన మాత్ర వేసుకోని వారు ఈనెల 17న తప్పక వేసుకోవాలన్నారు. విద్యాశాఖ, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఇతర శాఖల సహకారంతో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్ బి ఎస్ కే డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

అసభ్యకర ప్రవర్తన కేసులో 3 నెలల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మైనర్ మూగ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితునికి మూడు నెలల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.30 వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం పోక్సో కోర్టు తీర్పునిచ్చిందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... పాయకరావుపేట మండలం అరట్లకోట గ్రామానికి చెందిన మలక శామ్యూల్ 2018 మే 27న కల్లు తాగేందుకు కల్లు అమ్ముతున్న బాధిత బాలిక తల్లి వద్దకు వచ్చాడు. వేరే గదిలో ఉన్న మూగ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చూసిన బాలిక అన్నయ్య అడ్డగించడంతో అతనిని బలవంతంగా నెట్టి పారిపోయాడు. దీంతో బాలిక అన్నయ్య చేసిన ఫిర్యాదు మేరకు నేరం రుజువు కావడంతో సదరు కోర్టు మంగళవారం ఈ తీర్పునిచ్చినట్టు ఎస్పీ తెలిపారు. మహిళలు, బాలికలపై జరిగిన నేరాలను ప్రయారిటీ కేసులో భాగంగా ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి, కోర్టులో నేరాభియోగపత్రం సమర్పించి, కోర్టులో విచారణ త్వరగా వచ్చే విధంగా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

సచివాలయంలో వెక్కిరిస్తున్న కుర్చీలు

సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా దర్శనం

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామ సచివాలయాల్లో సిబ్బంది నిల్... హాజరు పట్టీలో అటెండెన్స్ మాత్రం ఫుల్... ఏదైనా సమస్య చెప్పుకుందామంటే.. దేనికైనా దరఖాస్తు చేసుకుందామంటే ఒకరు కూడా అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు మండల కేంద్రం కె.కోటపాడు గ్రామ సచివాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఇంటి పన్ను కడదామంటే కార్యదర్శి, గుమస్తా ఎవరూ లేరు. రెవెన్యూకు సంబంధించి ఏమైనా దరఖాస్తు చేద్దామంటే సంబంధిత సిబ్బంది ఎవరూ లేరు. మంగళవారం గ్రామ సచివాలయానికి అనేక పనులపై వచ్చిన పలువురు లబ్ధిదారులు ఇక్కడ పరిస్థితులను చూసి పెదవి విరిచారు. ఖాళీ కుర్చీలను ఫొటో తీసి స్థానిక విలేకరులకు పంపించారు. ఉదయం ఎఫ్ఆర్‌సి వేసి వెళ్ళిపోతున్నారని ఆరోపించారు. తన భూమికి సంబంధించి మ్యూటేషన్‌కు దరఖాస్తు చేయడానికి మూడు రోజుల నుండి తిరుగుతున్నా ఎవరూ కనిపించడం లేదని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఆరోపించారు. ఇక సామాన్య ప్రజలకు సేవలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై స్థానిక సచివాలయ కార్యదర్శి శ్రీనును విలేకరులు అడగ్గా మొత్తం సిబ్బందిలో ఇద్దరు మహిళా ఉద్యోగులు మెటర్నిటీ సెలవుపై వెళ్లారని, ఒకరు డిప్యూటేషన్, ఇద్దరు పెన్షన్ వెరిఫికేషన్, ఒకరు బ్యాంకు పనిపై, ఇంకొకరు ఇంటి పన్ను వసూలుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. కార్యాలయంలో ఎవరూ లేకపోవడం వాస్తవమేనని ఆయన అంగీకరించారు.



కె.కోటపాడు సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

'రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు'

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వెంకన్న ఆలయంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటు చేసుకోలేదని, స్థానిక పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు రాజకీయ దురుద్దేశంతోనే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆలయ ఛైర్మన్ దొండా కన్నబాబు అన్నారు. ఆలయం ఈవో టిఎన్ఎస్.శర్మతో కలిసి మంగళవారం వడ్డాదిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను జనసేన పార్టీలో చేరాలని కొద్ది కాలంగా వారు ఒత్తిడి చేస్తున్నారని, తాను పార్టీ మారబోనని చెప్పడం వలనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తన సొంత భూమి 24 సెంట్లు ఇటీవల స్వామివారికి విరాళంగా ఇచ్చానని గుర్తు చేశారు. ఆరోపణలపై తాము ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్వామి వారికున్న 57 ఎకరాల భూమి ద్వారా వచ్చే శిస్తు, హుండీ, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, టికెట్లు, షాపుల అద్దెలు, ఆక్షన్ డిపాజిట్ ద్వారా గతేడాది రూ.14,14,822 ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రతి నెలా సిబ్బంది జీతాలకు, ధూపదీప నైవేద్యాలకు రూ.44,557 ఖర్చవుతుందని చెప్పారు. ఏడాదికోసారి దేవాదాయ శాఖ సీజీఎఫ్ కింద రూ.2.30లక్షలు తీసుకువెళ్లిపోతుందని తెలిపారు. మార్చిలో జరిగే కళ్యాణం ఉత్సవాలకు అన్నీ కలిపి సుమారు రూ.9 లక్షల ఖర్చవుతుందని, అందువలనే సిబ్బందికి నెలల జీతాలు ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. ఏడాదికోసారి ఉత్సవాల సమయంలోనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-యలమంచిలి : పొగాకు పండించే రైతులు పొగాకును ఆరబెట్టే క్యూరింగ్ విధానం బట్టే ధర పలుకుతుందని యలమంచిలి వ్యవసాయాధికారి పి.మోహనరావు తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి పెద్దపల్లి, ఎర్రవరం గ్రామాలను సందర్శించి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా పొగాకు రైతులు అవలంబిస్తున్న పంట విధానంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మంచు తగ్గిన తర్వాత పంట కార్శికి 19.19.19 ఒక కేజీ ఎకరానికి పిచికారి చేస్తే ఆకు పటిష్టంగా తయారవుతుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు దివ్య ప్రసన్న, రైతులు అప్పలస్వామి, స్వామి పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-చోడవరం : జెర్రిపోతుల రమణాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చోడవరం ఉషోదయ పబ్లిక్ స్కూల్లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సుమారు 250 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేసుకున్నారు. చోడవరం చుట్టుపక్కల 20 గ్రామాల నుండి చిన్నారులు, తల్లిదండ్రులు 500 మంది రెండు విడతలుగా ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జె.రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, డీన్ వెంకట వాసు, ఉషోదయ పబ్లిక్ స్కూల్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై భారీ ట్యాంకర్ ప్రయాణం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి జాతీయ రహదారి పెద్దపల్లి జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఓ భారీ ట్యాంకర్ హల్‌చల్ చేసింది. కాకినాడ పోర్టు నుంచి దిగుమతై ఒడిశాలోని బరంపురానికి ప్రయాణిస్తున్న ఈ వాహనం సుమారు 100 అడుగుల పొడవు, 30 అడుగుల ఎత్తు ఉంది. సుమారు 20 మంది సిబ్బంది పర్యవేక్షణలో ప్రయాణిస్తున్న ఈ భారీ ట్యాంకర్ రోజుకు 20 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తుందని పర్యవేక్షకులు తెలిపారు. ఈ వాహనం వెళ్తున్న ఎడమ జాతీయ రహదారిలో మరో వాహనం ఓవర్‌టేక్ చేయకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. హైవే రోడ్డు నిర్వాహకులతో పాటు పోలీసు, ట్రాన్స్‌పోర్టు అధికారులు కూడా భారీ ట్యాంకర్ ప్రయాణాన్ని పర్యవేక్షిస్తున్నారు. రోడ్డు మీద భారీ ట్యాంకర్‌ను చూసిన ప్రయాణికులు సైతం ఒక క్షణం ఆగి ట్యాంకర్‌ను వింతగా చూస్తున్నారు.



జాతీయ రహదారిపై వెళ్తున్న భారీ ట్యాంకర్

ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని రాజుపాలెంలో శ్రీసూర్యనారాయణ మూర్తి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనకాపల్లి సుంకర మెట్ట జంక్షన్ వద్ద ఉన్న శ్రీఉషా ఛాయా పద్మినీ సమేత శ్రీసూర్యనారాయణ మూర్తి దేవస్థానాన్ని సందర్శించారు. రాజుపాలెం సూర్యనారాయణ స్వామిని వైసిపి అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఆయన తనయుడు సూర్య విశ్వనాథ్, వైసిపి నాయకుడు మలసాల కుమార్ రాజా, 80వ వార్డు ఇన్‌ఛార్జి కెఎం నాయుడు ఇతర నాయకులు దర్శించుకున్నారు.


సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథ సప్తమి సూర్య జయంతి సందర్భంగా ఉదయం 4 గంటల నుండే అభిషేకాలు, పూజలు చేశారు. కోలాటాలు, ప్రసాదం, మజ్జిగ పంపిణీ, తాడుపెద్ది సేవ, చెట్టు భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాండ్రేగుల శ్రీరామ్, దూలం గోపి ఆధ్వర్యాన పల్సర్ బైక్ ఝాన్సీ రమేష్ మాస్టర్‌తో వి వారియర్స్ వారి డాన్స్ మస్తీ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

యలమంచిలి : యలమంచిలి గొల్లలకొండ సూర్యనారాయణమూర్తి కోవెలలో 'రథసప్తమి' వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామునుండే వందలాది మంది భక్తులు క్యూలైన్లలో వచ్చి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తీగెల సూర్యనారాయణమూర్తి, విసరపు రమేష్, మంజేటి త్రినాథ్ పాల్గొన్నారు.

మునగపాక : మునగపాకలో రథసప్తమి వేడుకల్లో భాగంగా దొడ్డివారి కుటుంబీకులు ఇలవేల్పు దుర్గాలమ్మ అమ్మవారిని జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాంతో పాటుగా పలువురు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సబ్బవరం : రథసప్తమి సందర్భంగా పెందుర్తి సూర్యనారాయణమూర్తి ఆలయాన్ని వైసిపి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రావికమతం : స్థానిక శివాలయం ఆవరణలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకులు రాచకొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో. తెల్లవారుజాము నుంచి ఆదిత్యుని దర్శనానికి భారీగా వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ తగు ఏర్పాట్లు చేసింది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట గ్రామంలో ఈ నెల 8న జరగనున్న శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం పోస్టర్, కరపత్రాలను శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న, ఉత్సవ కమిటీ సభ్యులు వేగి గోపికృష్ణ, ఆడారి నర్సింగరావు, కాండ్రేగులు సతీష్, పాల్గొన్నారు. దీనికి ముందు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కూడా ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట శత వసంత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మంటపంలో పూజలు, హోమం నిర్వహించారు. సాయంత్రం వెండి రథంపై నగర తిరువీధుల్లో మేళతాళాలతో అమ్మవారు ఊరేగింపు శోభయాత్ర ఘనంగా జరిగింది. పులి వేషాలు, దేవతమూర్తుల వేషధారణలో నేల డాన్స్, కోలాటం, పలు సాంస్కృతి కార్యక్రమాలు, మహిళల వాసవి మాత నామ సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రేజేటి సీతారామాచార్యులు, కొడమంచిలి వీర వెంకట సత్యనారాయణ మూర్తి బేబీ, కొండమంచిలి కమలాకర శ్రీరామ్ ప్రసాద్ కమల, కొరుకొండ బుచ్చిరాజు, గ్రంధి శేష కుమార్, బిళ్ళపాటి కృష్ణ కుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాధపురంలో శ్రీమల్లికార్జున స్వామి ఆలయ ప్రహరీ పునర్నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రహరీ పునర్నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సిఫార్సుతో ఏపి దేవాదాయ శాఖ నుండి రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు ఆలయ ఛైర్మన్ కింతాడ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె ఎస్ ప్రకాష్ మాజీ ఉపసర్పంచ్ పతివాడ చిన్నయ్య నాయుడు, భీమిని నాగేశ్వరరావు, భీమిలి నాయుడు గౌతమ్ బాబు విశ్వ నానాజీ పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు



ఉత్సాహంగా సాగుతున్న ఎడ్ల పరుగు పందేల ప్రదర్శన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని శంభువాని పాలెంలో పరదేశమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి ఎడ్ల పరుగుల ప్రదర్శన జరిగింది. విజేతలకు మొదటి బహుమతి జై వీరాంజనేయ (దేవరాపల్లి) రూ.12 వేలు, రెండవ బహుమతి పరదేశమ్మ తల్లి (వావిలాపాడు) రూ.10 వేలు, సాలుపర్తి రామనాయుడు రూ.8.వేలు చొప్పున అందజేశారు. మిగిలిన వారికి వరుస క్రమంలో రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2 వేలు, వెయ్యి రూపాయలు చొప్పున అందించారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరం జరిగాయి. విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఉగ్గిన దేవుళ్ళు, టిడిపి నాయకులు చల్లా నానాజీ, చల్లా తాతయ్యలు, పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతపురం జంక్షన్‌లో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, సోడిపల్లి మాజీ ఎంపిటిసి ధర్మిరెడ్డి సన్యాసినాయుడు, వెంకట సోమినాయుడు, ధర్మిరెడ్డి రాము, ధర్మిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీనాగేంద్ర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఉచిత ఆహార సేవ కార్యక్రమం నిర్వహించారు. సరిపా భాస్కర్ సంతోష్ కుమార్ తేజస్వని దంపతులు, దొడ్డి సత్యనారాయణ (బాబులు) 50 మంది నిరుపేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ నాగేంద్ర స్వామి ఆలయ ఛైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, మద్దాల క్రాంతి కుమార్, ఆలయ ముఖ్య సలహాదారు స్థానిక పెద్దలు పీలా రమణారావు, ఆడారి రామలింగస్వామి, కొణతాల శ్రీనివాసరావు, కొణతాల వరాహ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుస్తుల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ మానవత్వ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్‌సి వసతి గృహంలో మంగళవారం సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో 35 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్యాంట్లు, షర్టులను అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ బిహెచ్.రామయ్య, అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, న్యాయవాది శ్రీ దేగల రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

జల్లూరు వంతెనపై రాకపోకలు!

ఐదేళ్ల తర్వాత పనుల్లో కదలికపై వాహనదారులు, ప్రజల హర్షం


వాహన రాకపోకలకు సిద్ధమైన జల్లూరు వంతెన అప్రోచ్‌రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని జల్లూరు వద్ద వరహానదిపై వంతెన పునర్నిర్మాణ పనుల్లో ఐదేళ్ల తర్వాత కదలిక రావడంపై హర్షం వ్యక్తమౌతోంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టగా, వైసిపి ఐదేళ్ల పాలనలో దీన్ని పూర్తిగా వదిలేశారు. మళ్లీ టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు చేపట్టడంపై స్థానికంగా పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జల్లూరు వద్ద వరహానదిపై బ్రిటీషర్ల కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గత టిడిపి ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టింది, పిల్లర్లు స్థాయి దాటి శ్లాబ్ పనులు పూర్తి కాగా, ఈలోగా 2019 ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం స్థానే వైసిపి అధికారంలోకి రాగా, ఐదేళ్లపాటు వంతెన నిర్మాణం పట్టలేదు, మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంపై మండల వ్యాప్తంగా వాహనదారులు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు, వంతెన నిర్మాణం కోసం పలుమార్లు పలు సంఘాల నాయకులు సహా డివిజన్ వాసులు పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసిన అప్పట్లో స్పందన లేదు. కూటమి ప్రభుత్వ నాయకుల చొరవతో రూ. రెండు కోట్లు నిధులు మంజూరుకాగా, పనులు ప్రారంభించినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు, వంతెనకు బీటీ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది, ప్రస్తుతం చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు కారణంగా పాత వంతెన పైనుంచి రాకపోకలు ఆగిపోవడంతో కొత్తగా చేపట్టిన వంతెన పైనుంచి వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు, దీంతో దాదాపుగా వంతెన అందుబాటులోకి వచ్చినట్లేనని డివిజన్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎంపిడిఒ డి సీతారామరాజు ఆదేశించారు మంగళవారం.ఉపమాక సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇ సర్వీసెస్ సేవలపై ఆరా తీశారు. ఎంఎస్‌ఎంఇ సర్వే పక్కాగా చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మిస్సింగ్ సిటిజెన్స్, పెండింగ్ పేమెంటుల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సేవలను విస్తృతం చేయాలన్నారు.ఉద్యోగుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి

ప్రజాశక్తి- మాడుగుల : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని ఎంపిడిఒ కొంకి అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలో వీరనారాయణం గ్రామంలో ఎపిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డ్ ఉన్న ప్రతిఒక్కరూ హాజరు కావొచ్చన్నారు. చేసిన పనికి తగ్గట్టుగా రోజుకు రూ.300 వరకు కూలి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రజలు పాల్గొన్నారు.

చంద్రమ్మ దొరకు ఘన నివాళి


పుస్తకాలను పంపిణీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల సమితి మొట్టమొదటి అధ్యక్షుడిగా పనిచేసి మండలాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన దొండా చంద్రమ్మ దొర వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రమ్మ దొర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలో పలువురు ప్రముఖులు హాజరై, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు పెన్నులు,పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, సయ్యపురెడ్డి నారాయణరావు, పాచిల రమణ, నాగేశ్వరరావు, తలారి రమేష్, చంద్రమ్మ దొర మనవులు చంద్రశేఖర్, సతీష్, మురళి,విస్సు, చంద్రమ్మ దొర విశాల్ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బస్సులతో పరేషాన్!



వేరే బస్సు కోసం ఎదురుచూస్తున్న పాడైన బస్‌లోని ప్రయాణికులు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో గర్నికం వద్ద నర్సీపట్నం డిపో బస్సు మరమ్మతులకు గురై మార్గమధ్యలో నిలిచిపోయింది. నర్సీపట్నం నుంచి చోడవరానికి బయలుదేరిన బస్సు రావికమతం మండలం గర్నికం వద్ద గేరు రాడ్డు విరిగిపోవడంతో బస్సు నిలిచిపోయింది. దీంతో బస్సులో 25 మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వేరే బస్సు వచ్చేంత వరకు ఎండలో నిల్చొని పడిగాపులు కాశారు. ఇపుడిపుడే ఎండలు ముదురుతుండడంతో ప్రయాణికులు చిన్నపిల్లలు వృద్ధులు అవస్థలు పాలయ్యారు. అలాగే రోలుగుంట నుంచి చోడవరం వరకు రోడ్డు కూడా పూర్తిగా గోతులమయం కావడంతో ఈ మార్గంలో బస్సులు తరచూ మరమ్మతులకు గురై ప్రయాణికులను అగచాట్లు పాల్జేస్తున్నాయి. ఈ మార్గంలో రోడ్డును బాగుచేయడంతోపాటు, మంచి కండిషన్ ఉన్న బస్సులను ఈ మార్గంలో ఆర్‌టిసి తిప్పాలని ప్రయాణికులు, ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఎస్‌టి కమిషన్ సభ్యులు


మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని ఎస్‌టి కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మంగళవారం సందర్శించారు. ముందుగా ఆయన ఆదివాసి నిందితులను స్వయంగా కలిసి మాట్లాడారు. కారాగారంలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. జైలుకు రావడానికి దారితీసిన పరిస్థితులు, వారికి అందుతున్న న్యాయసహాయాన్ని పర్యవేక్షణాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివాసీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలిసో తెలియకో చేసిన తప్పు కారణంగా జైలు జీవితాలు అనుభవిస్తున్నారని, ఇకనైనా జైలుకు రాకుండా సమాజంలో మెలగాలని సూచించారు. గంజాయి కేసులకు దూరంగా ఉండేలా, ఉపాధి కల్పించే దిశగా ఐటిడిఎ, జిసిసి సంస్థల సహకారం తీసుకొనే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మహేష్, ఉప పర్యవేక్షణాధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు


తీర్థంలో ఎడ్ల బండ్ల పోటీలు ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి - రావికమతం : ఏటా రథసప్తమి రోజున నిర్వహించే మండలంలో మేడివాడ ఆంజనేయ స్వామి వార్షిక తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలను ఎంపిపి పైల రాజు, మాజీ జెడ్‌పిటిసి ఆసరి వాసు గోవిందరావు ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ 20వేలను మాజీ జెడ్పిటిసి ఆసరి గోవిందరావు, రెండో బహుమతి మోపాడ మంగరాజు, జంపా చిరంజీవి, పెంటకోట శ్రీను, నందారపు మోగారావు రూ. 15 వేలు, మూడో బహుమతిగా అమరపల్లి నర్సింగరావు, గొర్లె గణేష్ లోవ రూ.పదివేలను నాలుగో బహుమతి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కుంచంగి కోటేశ్వరరావు, సిబ్బంది రూ.ఎనిమిది వేలు, ఐదవ బహుమతి దుగ్గల శేషు స్వామి రూ.6వేలు, ఆరో బహుమతి తామరపల్లి లోవరాజు రూ.ఐదు వేలు, ,ఏడవ బహుమతి పతివాడ బలరామకృష్ణ రూ.4వేలు, 8వ బహుమతి పతివాడ సాయి రూ.3వేలు నగదు బహుమతులను ఆర్థిక సహాయంగా అందజేశారని ఆలయ కమిటీ తెలిపింది. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసిపి మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మి నాయుడు, జెడ్పిటిసి ఆదిమూర్తి, మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, గుమ్మడి సత్య దేవ, శీలం శంకర్రావు పాల్గొన్నారు.. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆసరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

గొల్లపేటలో నల్లరాయి లారీల నిలిపివేత


గ్రామస్తులు నిలిపేసిన క్వారీ లారీలు

ప్రజాశక్తి -రోలుగుంట : మండలంలోని ఎస్.కొత్తూరు శివారు గొల్లపేట గ్రామస్తులు మంగళవారం రాజన్నపేట క్వారీ నుడి నల్లరాయిని రవాణా చేస్తున్న టిప్పర్ లారీలను అడ్డగించారు. టిప్పర్ లారీలు యథేచ్ఛగా రాకపోకలు సాగించడం వల్ల దుమ్ము ధూళితో తామంతా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఇపుడిపుడే రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని ఆనందం పడుతున్న పరిస్థితుల్లో 60 టన్నులపైబడి బరువుతో క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తే రోడ్డు పాడౌతుందని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు.క్వారీ యాజమానుల ప్రలోభాలకు లొంగి స్థానిక నేతలు రోడ్డు పాడౌతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగనివ్వబోమని హెచ్చరించారు.

చేపల వేట నిషేధ భృతి చెల్లించాలి


మత్స్యకారులతో కలిసి మాట్లాడుతున్న దొరబాబు

ప్రజాశక్తి-నక్కపల్లి : మత్స్యకారులకు చేపల వేట నిషేధ భృతిని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు చేపల వేట నిషేధసమయంలో మత్స్యకారులకు ఇస్తామన్న భృతిని నేటికీ చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు.

మరో రెండున్నర నెలలో చేపల వేట నిషేధం మళ్లీ అమల్లోకి వస్తుందని, ఇప్పటికైనా నిషేధభృతి బకాయి చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది చేపల వేట నిషేధ కాలంలో ఒక్కో మత్స్య కారుడికి రూ.20 వేల చొప్పున నిషేధ భృతి అందజేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, జిల్లా సమితి సభ్యులు అర్జున్, మండల కార్యదర్శి అజయ్, మత్స్యకార సంఘ నాయకులు బొంది బాబ్జి, పిక్కి అంజి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై

తక్షణ చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కెవిపిఎస్ నేత ఈరెల్లి చిరంజీవి

ప్రజాశక్తి-రోలుగుంట: పాయకరావుపేట అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ 2014లో ఈ పార్కులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. భారత రాజ్యాంగం రాసి 76ఏళ్ల పూర్తయిన సందర్భంలో ఇటీవల రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్న సందర్భంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. బడుగు బలహీన వర్గాలు, పేదలు, మహిళలు, కార్మికుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తగుచర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్త ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యేసు అప్పారావు పాల్గొన్నారు

వ్యక్తిగత క్రమశిక్షణకు దోహదం

ప్రజాశక్తి - నక్కపల్లి : స్కౌట్స్, గైడ్స్‌లో చేరితే వ్యక్తిగత క్రమశిక్షణ పెంపొందుతుందని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి సత్యారావు అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్‌కు అవగాహన కల్పించారు. దేశం పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత, వ్యక్తిగత క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, నాయకత్వ లక్షణం, మానసిక పరిపక్వత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌టి జిల్లా కార్యదర్శి కొణతాల రత్నకుమారి, జిల్లా గైడ్ కమిషనర్ వై సోనీ, స్కౌట్ మాస్టర్ పి శేఖర్, గైడ్ కెప్టెన్ హరిత కుమారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాన్యులపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని మున్సిపల్ కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లి దొర అన్నారు. మంగళవారం మాట్లాడుతూ సామాన్యులు భూములు కొనాలంటే భయపడే పరిస్థితి ఉందని, భూమి ధరతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం ఎక్కువగా ఉండడంతో వెనక్కు తగ్గే పరిస్థితి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలను రాష్ట్రమంతటా పెంచకుండా, అమరావతి రాజధాని ప్రాంతాన్ని మినహాయించడం సమంజసం కాదన్నారు.

జాతీయ స్థాయి లంగడీ పోటీల్లో
చోద్యం విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : తమిళనాడులోని పరమకూడి పంబూరులో జరిగిన జాతీయ స్థాయి లంగడీ పోటీల్లో చోద్యం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జనవరి 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరిగిన పోటీల్లో 11 మంది పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్ఎం పి..శ్రీనివాసరావు, పిఇటి కుందూరు నూకరాజు తెలిపారు. మన రాష్ట్రంలో ప్రాచుర్యం లేకపోయిన ఈ పోటీల్లో, ప్రావీణ్యత సాధించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి గెలుపొందడం ప్రశంసనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్‌గా పిఇటి కుందూరు నూకరాజు విద్యార్థులను తీసుకెళ్లారన్నారు. ఈ సందర్భంగా లంగడీ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులతోపాటు పిఇటిని స్కూల్ చైర్మన్ పి.సత్తిబాబు, సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ బీసీ రాష్ట్ర డైరెక్టర్ బొండల రాజు, వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ అభినందించారు. కార్యక్రమంలో సిహెచ్‌వి.రమణ, వరప్రసాద్, వాసు, బోధన, బోధనేతర సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాఫీ ప్లాంట్ రోడ్డు స్థల పరిశీలన



స్థలపరిశీలనకు వెళుతున్న ఆర్‌డిఒ రమణ

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని కొడవటిపూడి గ్రామాన్ని మంగళవారం నర్సీపట్నం ఆర్‌డిఒ వివి రమణ సందర్శించారు, కొడవటిపూడి శివారున అరకు కాఫీ ప్లాంట్‌కు రహదారి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయింపు, స్థలసమీకరణపై జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తాహసిల్దార్ తిరుమలబాబుతో కలిసి పరిశీలించారు, స్థల వివరాలు రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు, పూర్తి సమాచారం సేకరించి వివరాలు అందజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విఆర్ఒ వెంకట సుధా, తెలుగు యువత మండల అధ్యక్షులు తిరుమలరావు, ఎంపిటిసి ప్రకాష్ ,విలేజ్ సర్వేయరు శ్రీను పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నాతవరం మండలం గునుపూడి గ్రామానికి చెందిన నిండుగొండ వెంకన్నకు చెందిన ఇల్లు ఇటీవల దగ్ధమైంది. మంగళవారం దగ్ధమైన ఇంటిని పరిశీలించి, బాధిఉతులను పరామర్శించారు. జనసేన ఆధ్వర్యంలో అగ్నిప్రమాదబాధితులకు 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర అందజేశారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం, గృహనిర్మాణపథకంలో ఇళ్లు మంజూరుకు కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాటం ఫలించింది..
ఊరికి వెలుగొచ్చింది!

- విద్యుత్ వచ్చిన ఆనందంలో థింసా నృత్యాలతో రాత్రంతా సందడి చేసిన నీలబంద గిరిజనులు



రాత్రంతా ఆనందంతో థింసా నృత్యాలు చేసిన గిరి మహిళలు, చిన్నారులు

ప్రజాశక్తి-రోలుగుంట : సిపిఎం ఆధ్వర్యాన ఆదివాసీ గిరిజనుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. కొండశిఖర నీలబంద గ్రామానికి విద్యుత్ వెలుగులు వచ్చాయి. కరెంట్ వచ్చిందన్న ఆనందంలో ఆ వెలుగుల్లోనే ఆ గ్రామ గిరిజనులు సోమవారం రాత్రంతా థింసా నృత్యాలు, ఆటపాటలతో గ్రామంలో సందడిచేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ వెన్నంటే ఉండి, సమస్యలపై పోరాటం చేస్తూ, పరిష్కారానికి కృషి చేస్తున్న సిపిఎం శ్రేణులుకు కృతజ్ఞతలు తెలిపారు

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండ శిఖర గ్రామమైన నీలబంద ఆదివాసీ గిరిజనుల పోరాటం ఫలించింది. ఏళ్లనాటి కల సాకారమైంది. సిపిఎం ఆధ్వర్యంలో పోరాటంతో సోమవారం ఆ గ్రామంలో విద్యుత్ వెలుగులు విరజిల్లాయి.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి నేటికి 77 ఏళ్లవుతున్నా ఇన్నాళ్లు అంధకారంలో మగ్గిన వారంతా, తమ గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించాలంటూ ఎన్నోసార్లు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. సిపిఎం ఆధ్వర్యంలో కాగడాలతో ఆందోళనకు చేపట్టారు. దీనిపై పత్రికల్లో ప్రధానంగా ప్రచురితం కావడంతో అధికారులు, నేతల్లో కదలిక వచ్చింది. ఎట్టకేలకు నీలబంద గ్రామానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. గ్రామంలో విద్యుత్ వెలుగులు నిండడంతో గిరిజనులంతా రాత్రంతా థింసా నృత్యాలతో ఆనందోత్సవాలు జరుపుకున్నామని గ్రామస్తులు గెమ్మిలి చిన్న, గెమ్మిల అప్పారావు తదితరులు తెలిపారు. సిపిఎం కృషి ఫలితంగా కరెంటు సౌకర్యం వచ్చిందని, జిల్లా కలెక్టర్, విద్యుత్‌శాఖాధికారులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీమా రంగంలో ఎఫ్‌డిఐలను వ్యతిరేకిస్తూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : ఎఫ్‌డిఐలను వ్యతిరేకిస్తూ స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిఇయు బేస్ యూనిట్ అధ్యక్షులు కేకేపి పడాల్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లోబీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74శాతం నుంచి వందశాతానికి పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖామంత్రి ప్రకటించారన్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మూలధన సమీకరణపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ చర్య వల్ల ప్రభుత్వ విధానాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఖండిస్తోందన్నారు. దీనిపై ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తున్నట్లు వెల్లడించారు.

1999లో ఐఆర్‌డిఎ బిల్లు ఆమోదం పొందిన తర్వాత బీమా రంగాన్ని ప్రయివేటీకరించారని, ఈ చట్టం ద్వారా భారతీయ పెట్టుబడిదారులు విదేశీ భాగస్వాములతో కలిసి బీమా వ్యాపారం నిర్వహించేందుకు అనుమతి పొందారన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. భారతీయ కంపెనీలు, భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఈ నిర్ణయం తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ ఎస్ ధనార్జన్, ఎఐఒ బ్రాంచ్ అధ్యక్షులు శ్రీరామమూర్తి, వి చిన్నయ్య, గంటా శ్రీనివాసరావు, రంగా పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి -నక్కపల్లి : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ,రైతులకు సహాయపడటానికి రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు నర్సీపట్నం ఆర్‌డిఒ రమణ తెలిపారు.మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఎఒ ఉమా ప్రసాద్‌తో గుర్తింపు కార్డులు జారీపై చర్చించారు. వ్యవసాయ రుణాలను పొందటానికి, సిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా, ఇతర వ్యవసాయప్రయోజనాలు, సేవలను ఈ గుర్తింపు కార్డు ద్వారా రైతులు సులభతరంగా పొందవచ్చునన్నారు. రైతులకు గుర్తింపు కార్డులు నమోదు ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ సిబ్బందితో కలిసి పనిచేయాలని ఆర్‌డిఒ సూచించారు. ఎంఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి



హౌసింగ్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- మాడుగుల : గత ప్రభుత్వహయాంలో మంజూరైన ఇంటిస్థలాల్లో నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి, మార్చినెలాఖరుకు పూర్తిచేయాలని, ఈ మేరకు లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కొంకి అప్పారావు సూచించారు. మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చాలామంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాగా, ఆయా స్థలాలలో నేటి వరకు చాలామంది ఇల్లు నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. కొన్ని గ్రామాల్లో పునాదులు,లింటల్ లెవెల్‌లోనే పనులు వదిలేశారన్నారు. అయితే ఆయా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినందున, దానికి అనుగుణంగా నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇఇ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న వార్షిక కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



ఉత్సవ ఏర్పాట్లు పై చర్చిస్తున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకన్న ఆలయంలో వచ్చేనెల 9 నుంచి నిర్వహించనున్న వార్షిక కళ్యాణోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మంగళవారం ఉపమాక వెంకన్న అనిత దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వార్షికోత్సవ ఏర్పాట్లపై ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్‌లు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, తెలుగుదేశం మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితర నాయకులతో చర్చించారు

వచ్చేనెల 9న ప్రారంభంకానున్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా 10న స్వామి కల్యాణం జరుగుతుందని,రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, స్నాన ఘట్టాలు మరుగుదొడ్లు, తాగునీరు, శానిటేషన్ నిర్వహణ, ఆలయం, పరిసర ప్రాంతాల్లో విద్యుద్దీకరణ పై చర్చించారు. గాలిగోపురం ఎదుట తాత్కాలిక షెడ్డు నిర్మాణం, స్వామికళ్యాణం భక్తులు తిలకించేందుకు స్క్రీన్లు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ ఆంక్షలు, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై మాట్లాడారు. కళ్యాణోత్సవాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని సూచించారు. టిటిడి అధికారులతో ఉత్సవ ఏర్పాట్లుపై చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, టిడిపి పాయకరావుపేట, కోటవురట్ల మండల శాఖ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, నాయకులు లాలం కాశీ నాయుడు, కురుందాసు నూకరాజు, కొప్పిశెట్టి శ్రీను, ప్రగడ వీరబాబు, పెంకుల రాజు, మీగడ సత్తిబాబు, వెలగా శ్రీను, దొరబాబు,తోలేటి శ్రీనివాస్, వాసు, మెరుగు నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

ఉపమాక వెంకన్న దర్శనానికి వచ్చిన హోంశాఖమంత్రి అనితకు స్థానికులు పలు సమస్యలపై వినతులు అందజేశారు. భూ సమస్యలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలు, రోడ్లు నిర్మాణం, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. తగ్గించిన కూలిరేట్లు పెంచాలని ఉపమాక వెంకన్న వాహనాలు మోసే బోగీల విన్నవించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హోంమంత్రి హామీనిచ్చారు.